ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
తమిళనాడు
TAMILNADU
మంగళవారం 18 జూన్ 2024

పుదుచ్చేరి ప్రభుత్వంలో అసమ్మతి?

- బీజేపీ ఎమ్మెల్యేల ప్రత్యేక భేటీ
- కాంగ్రెస్, డీఎంకే ఎమ్మెల్యేలకు సీఎం ఆహ్వానం
- డుమ్మాకొట్టిన 'ఇండియా' కూటమి ఎమ్మెల్యేలు


ఎన్.రంగస్వామి

పుదుచ్చేరి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరి ప్రభుత్వంలో అసమ్మతి రేగే సూచనలు కనిపిస్తున్నాయి. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి నమశ్శివాయం పరాజయం ఈ కూటమిలో చిచ్చు రేపుతోంది. తమకు ముఖ్యమంత్రి రంగస్వామి సరిగ్గా సహకరించకపోవడమే తమ అభ్యర్థి ఓటమికి కారణమని బీజేపీ ఎమ్మెల్యేలు అనుమానిస్తుండగా, ఆది నుంచి తమ పట్ల చిన్నచూపు చూస్తున్న బీజేపీ ఎమ్మెల్యేలతో తాడోపేడో తేల్చుకోవాలని ఎన్‌ఆర్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు భావిస్తున్నారు.

మొత్తం 30 స్థానాలున్న పుదుచ్చేరిలో 2021లో జరిగిన ఎన్నికల్లో ఎన్‌ఆర్ కాంగ్రెస్ 10, బీజేపీ 6, స్వతంత్రులు 6, డీఎంకే 6, కాంగ్రెస్ 2 స్థానాలు పొందాయి. ఆ సమయంలో స్వతంత్రులంతా బీజేపీలో చేరడంతో ఆ పార్టీ బలం 12కి చేరినట్లయింది. దీంతో ఎన్‌ఆర్ కాంగ్రెస్, బీజేపీ కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. ముఖ్యమంత్రిగా ఎన్‌ఆర్ కాంగ్రెస్ అధినేత రంగస్వామి వున్నప్పటికీ.. బీజేపీ ఎమ్మెల్యేలు ఆయనకు సరిగ్గా సహకరించడం లేదన్న ఆరోపణలున్నాయి. అంతేగాక కేంద్రప్రభుత్వం సరిగ్గా నిధులు విడుదల చేయడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. దీనికి తోడు సాక్షాత్తు ముఖ్యమంత్రే.. తనకు రూపాయి కూడా వ్యయం చేసే అధికారం లేకపోయిందంటూ పలుమార్లు వాపోవడం గమనార్హం. అంతేగాక బీజేపీ ఎమ్మెల్యేలు గానీ, ఆ పార్టీ అధిష్ఠానం గానీ తనకు సరైన మర్యాద ఇవ్వడం లేదని రంగస్వామి తీవ్ర మనస్థాపంతో వున్నారు. కాగా ఇటీవల జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో పుదుచ్చేరి మంత్రి నమశ్శివాయం పోటీ చేశారు. అయితే పుదుచ్చేరి నియోజకవర్గంలో ఆయన ఓటమి చెందారు. ఈ వ్యవహారంపై బీజేపీ నేతలు రగిలిపోతున్నారు. ఎన్‌ఆర్ కాంగ్రెస్ సరిగ్గా సహకరించకపోవడం వల్లనే తమ అభ్యర్థి ఓటమిపాలయ్యారని బీజేపీ నేతలు తీవ్ర అసంతృప్తితో వున్నారు. ఇందులో భాగంగా ఆ పార్టీ ఎమ్మెల్యేలంతా ఇటీవల ఓ రిసార్టులో రహస్యంగా భేటీ అయినట్లు తెలిసింది. ఈ విషయం బయటకు రావడంతో ముఖ్యమంత్రి రంగస్వామి కూడా ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. అయితే ఆ భేటీకి ఎన్‌ఆర్ కాంగ్రెస్‌తో పాటు బీజేపీ ఎమ్మెల్యేలకు కూడా ఆహ్వానం పంపించారు. దీంతో సీఎం భేటీకి వెళ్లిన బీజేపీ ఎమ్మెల్యేలు.. ఆ హోటల్లో ఉన్నతాధికారులు కూడా వుండడంతో ఆశ్చర్యపోయారు. వారి ముందు రాజకీయాల గురించి ఏం మాట్లాడగలమని మిన్నకుండిపోయారు. అయితే విందు ముగిశాక అధికారులకు పంపించివేసిన సీఎం.. ఆ తరువాత ఆయన కూడా వెళ్లిపోయారు. ఈ భేటీలో ఎలాంటి చర్చ గానీ, మంతనాలు గానీ లేకపోవడంతో బీజేపీతో పాటు ఎన్‌ఆర్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కూడా దిగ్ర్భాంతి చెందారు. ఆ సమావేశం ఎందుకు ఏర్పాటు చేశారో అర్థం గాక వారు తలల బాదుకున్నారు. ఇదిలా వుండగా రంగస్వామి కాంగ్రెస్, డీఎంకే ఎమ్మెల్యేలను ప్రత్యేక విందుకు ఆహ్వానించినట్లు తెలుస్తోంది. అయితే ఆయన నుంచి ఆహ్వానం అందుకున్న 'ఇండియా' కూటమి ఎమ్మెల్యేలు.. ముఖం చాటేశారని తెలిసింది. ఈ భేటీలు, ఆహ్వానాలపై పుదుచ్చేరి రాజకీయవర్గాల్లో వాడివేడిగా చర్చ జరుగుతోంది. నిజానికి గతంలో బీజేపీతో దూరంగా జరిగితే తాము అండగా నిలబడతామంటూ కాంగ్రెస్-డీఎంకే పార్టీలు ప్రకటించాయి. అయితే అప్పట్లో వారి వినతిని రంగస్వామి పట్టించుకోలేదు. ఇప్పుడు బీజేపీ తనను ఇరుకునపెడుతోందని భావిస్తున్న రంగస్వామి.. ఇండియా కూటమికి దగ్గరయ్యేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. అయితే బీజేపీని వదిలేస్తేనే తాము అండగా నిలుస్తామని ఇండియా కూటమి నేతలు చెబుతున్నారు. మొత్తమ్మీద ఈ వ్యవహారం ఎటు నుంచి ఎటు వెళ్తుందోనని పుదుచ్చేరి రాజకీయవర్గాలు చర్చించుకుంటున్నాయి.

ఎయిర్‌పోర్ట్‌కు మళ్లీ బాంబు బెదిరింపు

రాత్రంతా కొనసాగిన తనిఖీలు

రెండువారాల్లో ఇది ఐదవ బెదిరింపు

చెన్నై, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక మీనంబాక్కంలోని జాతీయ, అంతర్జాతీయ విమానాశ్రయాలలో బాంబులు పేలనున్నాయని గుర్తుతెలియని వ్యక్తి బెదిరించడంతో బాంబ్‌స్క్వాడ్ నిపుణులు, భద్రతాదళం ఉన్నతాధికారులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఈ విమానాశ్రయాలకు రెండు వారాలలో వ్యవధిలో ఇలా బాంబు బెదిరింపులు రావటం ఇది ఐదోసారి అని భద్రతా విభాగం అధికారులు పేర్కొన్నారు. ఆదివారం రాత్రి విమానాశ్రయం డైరెక్టర్ కార్యాలయానికి వచ్చిన ఈ-మెయిల్ సందేశంలో విమానాశ్రయాలలో బాంబులు అమర్చి ఉన్నాయని, త్వరలో అవి పేలనున్నాయని పేర్కొనడంతో అధికారులు తీవ్ర దిగ్ర్భాంతి చెందారు. వెంటనే ఆ సమాచారాన్ని భద్రతాదళం ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీనితో బాంబ్‌స్క్వాడ్ నిపుణులు మెటల్ డిటెక్టర్లు, జాగిలాలతో హుటాహుటిన అక్కడికి చేరుకుని ముమ్మర తనిఖీలు జరిపారు. విమానాశ్రయాలకు వచ్చే ప్రయాణికులను, వారి లగేజీలను మెటల్ డిటెక్టర్లతో తనిఖీ చేశారు. ఇదే విధంగా విమానాశ్రయాలకు వచ్చిన వాహనాలను, వాటి డిక్కీలను తెరచి మరీ మెటల్ డిటెక్టర్లతో సోదాలు జరిపారు. ఈ తనిఖీలు సోమవారం వేకువజాము వరకు కొనసాగటంతో రెండు విమానాశ్రయాల వద్ద తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇదిలా ఉండగా విమానాశ్రయానికి బాంబు బెదిరింపు సందేశాలు ఈమెయిల్ రూపంలో వస్తుండటంతో ఆ సందేశాలను పంపినవారి చిరునామాలు ఇతర వివరాలను కనుగొనలేక భద్రతాదళం అధికారులు సతమతమవుతున్నారు. గత రెండు వారాల వ్యవధిలో, ఫోన్‌ద్వారా, ఈమెయిల్ ద్వారా విమానాశ్రయాలకు బాంబు బెదిరింపు రావటం ఇది ఐదోసారి అని అధికారులు చెబుతున్నారు. రెండు విమానాశ్రయాలలో విమాన సేవలకు, విమాన ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించకుండా బాంబు తనిఖీలు కొనసాగించినట్లు భద్రతాదళం సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ఇలా పనిగట్టుకుని బాంబు బెదిరింపులకు పాల్పడుతున్నవారిని వెనువెంటనే కనుగొనలేకపోయినా సైబర్ క్రైం విభాగం సాయం ద్వారా దుండగులను కనుగొని వారిని కఠినంగా శిక్షిస్తామని పేర్కొన్నారు.


ఎయిర్‌పోర్ట్ వద్ద ప్రయాణికులను, వాహనాలను తనిఖీ చేస్తున్న బాంబ్ స్క్వాడ్ నిపుణులు

'నాన్ ముదల్వన్ పథకం'లో అరుదైన ఘట్టం

- లండన్‌లో శిక్షణ పొంది తిరిగొచ్చిన విద్యార్థులు


లండన్‌లో శిక్షణ పూర్తి చేసుకుని తిరిగొచ్చి చెన్నై క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి స్టాలిన్‌ను, మంత్రి ఉదయనిధిని కలుసుకున్న విద్యార్థులు

చెన్నై, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ డ్రీమ్ ప్రాజెక్టు 'నాన్ ముదల్వన్ పథకం' అమలులో అరుదైన ఘట్టం చోటుచేసుకుంది. ఆ పథకం ద్వారా లండన్‌లో పటిష్టమైన శిక్షణ పొందిన 25 మంది విద్యార్థులు నగరానికి తిరిగొచ్చారు. ఆ విద్యార్థులకు విమానాశ్రయం వద్ద అపూర్వ స్వాగతం లభించింది. నాన్ ముదల్వన్ పథకం ద్వారా విద్యార్థులకు వారు చదువుతున్న పాఠ్యాంశాలకు అనువైన అదనపు ప్రతిభా పాటవాలను పెంపొందించుకునేలా ప్రత్యేక శిక్షణలను ప్రభుత్వం అందిస్తోంది. ఈ ప్రత్యేక శిక్షణ కోసం విద్యార్థులను విదేశాలకు కూడా పంపటం ఈ పథకంలో ప్రత్యేకాంశమని చెప్పవచ్చు. ఆ మేరకు లండన్‌లోని న్యూ కేస్టల్ దుర్హామ్ విశ్వవిద్యాలయంలో వారం రోజులపాటు బ్రిటిష్ కౌన్సిల్ సహకారంతోతో రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ కృత్రిమ మేధోపరిజ్ఞానం (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్). గుణాత్మక పరిజ్ఞానంలో శిక్షణ పొందటానికి భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఈ శిక్షణకుగాను 15 మంది ఇంజనీరింగ్ విద్యార్థులు, 10 మంది సైన్స్ విద్యార్థులు చొప్పున 25 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. వీరందరిని లండన్‌కు తీసుకెళ్ళారు. వారం రోజులపాటు న్యూ కేస్టల్ దుర్హామ్ విశ్వవిద్యాలయంలో శిక్షణ పూర్తి చేసుకుని ఆ విద్యార్థులు విమానంలో సోమవారం వేకువజాము నగరానికి తిరిగొచ్చారు. వీరికి కుటుంబసభ్యులు, స్నేహితులు, అధికారులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ నాన్ ముదల్వన్ పథకం ద్వారా ప్రభుత్వ ఖర్చులతో లండన్ విశ్వవిద్యాలయం శిక్షణ పొందటం మరపురాని అనుభూతిని కలిగిస్తోందని, తమ ప్రతిభాపాటవాలను ఈ శిక్షణ మరింతగా మెరుగుపరిచిందనటం అతిశయోక్తి కాదని చెప్పారు. తమను లండన్‌కు పంపి వారం రోజులపాటు ప్రత్యేక శిక్షణలందించిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌కు, మంత్రి ఉదయనిధి స్టాలిన్‌కు ధన్యవాదాలు తెలుపుకుంటున్నామని పేర్కొన్నారు. ఆ తర్వాత ఈ విద్యార్థులందరూ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను కలుసుకున్నారు.

అన్నాడీఎంకేలో విలీనంపై 20న ఓపీఎస్ సమాలోచనలు

అడయార్, జూన్ 17: మాతృసంస్థ అన్నాడీఎంకేలో విలీనమయ్యే విషయంపై మాజీ ముఖ్యమంత్రి, ఆ పార్టీ బహిష్కృత నేత ఓ.పన్నీర్ సెల్వం ఈ నెల 20వతేదీన తన అనుచరగణంతో సమావేశం కానున్నారు. ముగిసిన సార్వత్రిక ఎన్నికల్లో అన్నాడీఎంకే కొన్నిపార్టీలతో కలిసి పోటీ చేసినప్పటికీ ఒక్క స్థానంలో కూడా గెలవలేకపోయింది. అలాగే, త్వరలో జరగనున్న విక్రవాండి అసెంబ్లీ ఉపఎన్నికలో కూడా పోటీచేయరాదని ఆపార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి కె.పళనిస్వామి నిర్ణయించారు. లోక్‌సభఎన్నికల్లో పార్టీ ఘోర ఓటమి, ఉప ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉండాలని తీసుకున్న నిర్ణయం ఆ పార్టీ శ్రేణులను తీవ్ర నిరుత్సాహానికి గురిచేశారు. ఆ సమయంలో 'అన్నాడీఎంకే సమైఖ్య కమిటీ' పేరుతో ఆపార్టీకి దూరమైన సీనియర్ నేతలను ఒక్క టిచేసేందుకు సీనియర్ నేతలైన జీసీటీ ప్రభాకర్, కేసీ పళనిస్వామి, బెంగళూరుకుచెందిన పుగళేందిలు తమవంతు ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఇందులోభాగంగా, ఎడప్పాడి కె.పళనిస్వామి, ఓ.పన్నీర్‌సెల్వ, శశికళ, టీటీవీ దినకరన్ వంటివారికి లేఖలు కూడా రాశారు. మరోవైపు ఆదివారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆపార్టీ బహిష్కృతనేత శశికళ మాట్లాడుతూ,తాను అన్నాడీఎంకేలో రీఎంట్రీకి సమయం ఆసన్నమైందంటూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలో ఓ పన్నీర్‌సెల్వం కూడా అన్నాడీఎంకేలో విలీనంపై తమ అనుచరులతో ఈ నెల 20వ తేదీ గురువారం చర్చలు జరుపున్నారు.

'వందే భారత్' ట్రయల్ రన్ విజయవంతం

పెరంబూర్, జూన్ 17: మదురై-బెంగుళూరు మధ్య వందే భారత్ రైలు సేవలు త్వరలో ప్రారంభం కానున్న నేపథ్యంలో, అందుకు సంబంధించిన ట్రయల్ రన్ సోమవారం విజయవంతంగా నిర్వహించారు. దక్షిణ రైల్వే పరిధిలో చెన్నై-మైసూరు, చెన్నై-కోవై, చెన్నై-తిరునల్వేలి, తిరువనంతపురం-కాసర్‌కోడ్, చెన్నై-విజయవాడ, కోవై-బెంగుళూరు మధ్య వందే భారత్ రైలు సేవలు అందుబాటులో ఉన్నాయి. ఈ క్రమంలో, మదురైనుంచి బెంగళూరుకు వందేభారత్ రైలు నడపాలని ఆ ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు. దీంతో, మదురై-బెంగుళూరు మధ్య కొత్త వందే భారత్ రైలు సేవలను త్వరలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారు. ఈ రైలు దిండుగల్, కరూర్, సేలం, ధర్మపురి, హోసూరు మీదుగా నడుపనున్నారు.

పాల ఉత్పత్తిలో సరికొత్త చరిత్ర

10.10 మిలియన్ టన్నుల దిగుబడి

అడయార్, జూన్ 17: పాల ఉత్పత్తిలో రాష్ట్రం సరికొత్త చరిత్ర సృష్టించిందని, ఏకంగా 10.10 మిలియన్ టన్నుల మేరకు పాలను ఉత్పత్తి చేస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. ప్రపంచంలో పాల దిగుబడి భారత్‌లో అధిక శాతం జరుగుతుంటే, దేశం మొత్తం ఉత్పత్తిలో ఒక్క మన రాష్ట్రం నుంచే 4.57 శాతం మేరకు పాల దిగుబడి జరుగుతుందని ప్రభుత్వం సోమవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా పాడి ఉత్పత్తుల సంస్థ ఆవిన్ నుంచి నాణ్యవంతమైన పాలను సరఫరా చేస్తున్నారు. అయితే, రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎంకే స్టాలిన్ బాధ్యతలు తొలి రోజునే సంతకాలు చేసిన ఏడు ఫైళ్ళలో ఒకటిగా లీటరు ఆవిన్ పాల ధరపై రూ.3 మేరకు తగ్గించే ఫైలుపై కూడా సంతకం చేశారని తెలిపింది. గత మూడేళ్ళలో పాడి పరిశ్రమాభివృద్ధికి ప్రభుత్వం ఎన్నో రకాలైన చర్యలు చేపట్టిందని పేర్కొంది. రాష్ట్ర వ్యాప్తంగా 9,189 ప్రాథమిక పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాల ద్వారా ప్రతి రోజూ 3.85 పాడి రైతుల నుంచి పాలను సేకరిస్తున్నారు. ఈ పాడి రైతుల నుంచి 35.67 లక్షల లీటర్ల పాలను సేకరిస్తున్నారు. ఇందులో 4 లక్షల లీటర్ల పాలను స్థానిక అవసరాల కోసం విక్రయించగా, మిగిలిన 31.67 లక్షల లీటర్ల పాలను 27 జిల్లా సహకార యూనియన్‌ల ద్వారా సేకరిస్తున్నారు. ఇపుడు మొత్తంగా 10.10 మిలియన్ టన్నుల పాలను ఉత్పత్తి చేసి రాష్ట్రం సరికొత్త చరిత్రను సృష్టించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆవిన్ సిబ్బంది ఎంతో శ్రద్ధతో నిజాయితీతో పనిచేస్తున్నారని తెలిపింది. ఆవిన్ సంస్థలో పాల ఉత్పత్తితో పాటు పాడి ఉత్పత్తుల విక్రయాలు రూ.590 కోట్ల మేరకు సాగుతున్నాయని వెల్లడించింది. జాతీయ స్థాయిలో ఆవిన్ సంస్థకు రెండు వేలకు పైగా అవార్డులు, రివార్డులు వచ్చాయని ప్రభుత్వం పేర్కొంది.



పాలకేంద్రాలను ఆవిష్కరిస్తున్న సీఎం


తంజావూరు తపాలా కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు, రైతులు

కర్ణాటక ప్రభుత్వ వైఖరికి నిరసన

తంజావూరులో రైతుల ధర్నా

చెన్నై, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కావేరి జలాలను విడుదల చేయని కర్ణాటక ప్రభుత్వ తీరును ఖండిస్తూ తంజావూరు తపాలా కార్యాలయం ఎదుట రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు ధర్నా నిర్వహించారు. కావేరినదిలో మెకెదాటు వద్ద కర్ణాటక ప్రభుత్వం ఆనకట్టను నిర్మించకుండా కేంద్ర ప్రభుత్వం అడ్డుకోవాలని, రాష్ట్రంలోని జలాశయాలు, చెరువులు, చెక్‌డ్యామ్‌లలో పూడిక తీరత పనులు చేట్టాలని కోరుతూ రైతులు డిమాండ్ చేశారు. ఈ ఆందోళనకు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎన్‌వీ కన్నన్ నాయకత్వం వహించారు. జిల్లా అధ్యక్షుడు సెంథిల్‌కుమార్, ఉపాధ్యక్షుడు మహమ్మద్ అలీ తదితరులు పాల్గొన్నారు. ధర్నాలో నాయకులు మాట్లాడుతూ.. కావేరి డెల్టా రైతులకు కర్ణాటక ప్రభుత్వం సకాలంలో కావేరి జలాలను విడుదల చేయడం లేదని ఆరోపించారు. గత యేడాది రాష్ట్రానికి 90 టీఎంసీల జలాలలను విడుదల చేయలేదని, ప్రస్తుత సంవత్సరంలో ఇప్పటి దాకా 10 టీఎంసీల జలాలు విడుదల చేయలేదని, మొత్తానికి 100 టీఎంసీల కావేరి జలాలను విడుదల చేయకుండా కర్ణాటక ప్రభుత్వం మొండి వైఖరిని అవలంబిస్తోందని ఆరోపించారు.

కువైట్ ప్రమాద మృతుడి కుటుంబీకులకు కనిమొళి ఓదార్పు



చెన్నై, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): కువైట్‌లో పలు అంతస్తుల భవన సముదాయంలో ఇటీవల సంభవించిన అగ్ని ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కోవిల్‌పట్టి వానరముట్టికి చెందిన మారియప్పన్ కుటుంబీకులను డీఎంకే ఎంపీ కనిమొళి కలుసుకుని పరామర్శించారు. మారియప్పన్ భార్య కర్పగవల్లి, కుమార్తె విమల, కుమారుడు కదిర్‌నిలవన్‌లను ఓదలకు అందజేశారు. తొలుత మారియప్పన్ నివాసగృహంలో ఉన్న ఆయన చిత్రపటం వద్ద కనిమొళి, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి గీతాజీవన్ పుష్పాంజలి ఘటించారు.

← మారియప్పన్ కుటుంబీకులకు రూ.5లక్షల చెక్కును అందజేస్తున్న డీఎంకే ఎంపీ కనిమొళి

త్యాగాలకు ప్రతీక బక్రీద్

మసీదులు, మైదానాల్లో ప్రార్థనలు ● రాష్ట్రవ్యాప్తంగా పండుగ సందడి


బ్రాడ్‌వే డాన్‌బాస్కో పాఠశాల ప్రాంగణంలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో ఇస్లామీయ మహిళలు


చిన్నారుల ఆలింగనం

ప్యారీస్, జూన్ 17: త్యాగానికి ప్రతీకగా భావించే బక్రీద్ పండుగను సోమవారం రాష్ట్రవ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. రాజధాని నగరం చెన్నైలో ప్రసిద్ధిచెందిన ట్రిప్లికేన్ పెద్ద మసీదు, థౌజండ్ లైట్స్ మసీదు సహా నాగపట్టణం జిల్లాలోని నాగూర్ దర్గా, మదురై తముక్క మైదానం, తూత్తుకుడి జిల్లా తిరుచెందూర్‌లోని పురాతన మసీదు, రామనాథపురంలో ప్రసిద్ధిచెందిన కాయల్‌పట్టణం, ఏర్వాడి దర్గా, పుదుకోట జుమ్మా మసీదు తదితర ప్రాంతాల్లో విశ్వశాంతిని కాంక్షిస్తూ నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో ముస్లింలు, మహిళలు, బాలబాలికలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ముస్లింలతో మసీదులు, ఈద్గాలు కళకళలాడాయి. పరస్పరం ఆలింగనం చేసుకొని ప్రేమాభిమానాలు పంచుకున్నారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం పేదలకు దానధర్మాలు, ఖుర్బానీ పేరుతో పొట్టేలు మాంసాన్ని దానం చేశారు. ఖుర్బానీ సమర్పించిన వారు పొట్టేలులోని ఒక భాగాన్ని బంధువులు, మరో భాగాన్ని పేదలకు, మిగతా మాంసాన్ని తమ కుటుంబానికి వినియోగించుకున్నారు. దైవ ప్రవక్త ఇబ్రాహీం, ఆయన కుమారుడు ఇస్మాయేల్ త్యాగాలను స్మరిస్తూ బక్రీద్ పండుగను కోలాహలంగా జరుపుకున్నారు. తమిళనాడు ముస్లిం మున్నేట్ర కళగం ఆధ్యాత్మిక విభాగం ఆధ్వర్యంలో స్థానిక బ్రాడ్‌వేలోని డాన్‌బాస్కో పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. విల్లుపురంలో ఉన్న కామరాజర్ బాలుర మహోన్నత పాఠశాల ప్రాంగణం, మదురైలో ఉన్న మసీదులు, మైదానాలు, విరుదాచలం నవాబ్ జానీ అస్మత్ దర్గా మైదానం, పట్టుకోట మసీదు, కోయంబత్తూర్ కరుంబుకడై ఉర్దూ మెట్రిక్యులేషన్ పాఠశాల ప్రాంగణం, కోవై పాత బస్తీలోని టిప్పుసుల్తాన్ మైదానం, తిరుచ్చి, సేలం, తిరునల్వేలి సహా రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో ఉన్న మసీదుల్లో బక్రీద్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కేంద్రపాలిత రాష్ట్రం పుదుచ్చేరిలో ఉన్న మసీదుల్లో కూడా ఉదయం 6 నుంచి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పుదుచ్చేరి బీచ్‌లో నిర్వహించిన ప్రార్థనల్లో ఇస్లామీయులతో పాటు పలు రాజకీయపార్టీల నిర్వాహకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు శాఖ బందోబస్తు పటిష్టం చేసింది.


ప్రత్యేక ప్రార్థనల్లో ఇస్లామీయులు

చెన్నై-హుబ్లీ రైళ్లకు ఎల్‌హెచ్‌బీ బోగీలు

ఐసిఎఫ్, జూన్17: చెన్నై సెంట్రల్-హుబ్లీ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ఈనెల 20 నుంచి ఎల్‌హెచ్‌బీ బోగీలు అనుసంధానం చేయనున్నట్లు దక్షిణ రైల్వే అధికారులు తెలిపారు. ఎక్స్‌ప్రెస్ రైళ్లకు పాత బోగీలు తొలగించి ఆధునిక బోగీలను అనుసంధానం చేసే పనులు జరుగుతున్నాయి. ఈ పెట్టెలు సులభంగా నిప్పంటుకోవని, కుదుపులు లేకుండా సురక్షితంగా, సౌకర్యవంతంగా ప్రయాణించేందుకు వీలుంటుంది. ఆధునిక సీట్లు, మొబైల్ ఫోన్ ఛార్జింగ్ వంటి సౌకర్యాలు కల్పించామని, సాధారణ బోగీల్లో 80 బెర్త్‌లు, ఏసీ బోగీల్లో 72 బెర్త్‌లుంటాయని అధికారులు తెలిపారు.

58 కిలోల నాణేలతో మొక్కు చెల్లింపు

ఐసిఎఫ్, జూన్ 17: తిరుచ్చి సమయపురం మారియమ్మన్ ఆలయంలో అమ్మవారిని దర్శించుకున్న ఓ భక్తుడు 58 కిలోల నాణేలను మొక్కుగా చెల్లించారు. తమ మొక్కులు నెరవేరిన అనంతరం భక్తులు చెరకుగడల తొట్టిలో శిశువులను మోస్తూ ఆలయ ప్రదక్షిణ చేయడం, తులాభారం సమర్పణ, బంగారు, వెండి, కరెన్సీ నోట్లను కానుకలుగా హుండీల్లో వేయడం చేస్తుంటారు. ఈ నేపథ్యంలో, కుంభకోణానికి చెందిన సుధాకర్ తన మొక్కు నెరవేరినందుకు కుటుంబ సమేతంగా ఆదివారం అమ్మవారిని దర్శించుకున్నారు. తమ బరువుకు సమానంగా 58 కిలోల రూ.1,2,5 నాణేలను కానుకగా సమర్పించారు.

సెంట్రల్-తిరువళ్లూర్ రైలు సేవలు రద్దు

ఐసిఎఫ్, జూన్ 17: చెన్నై సెంట్రల్-తిరువళ్లూర్ సబర్బన్ రైలు సేవలు బుధ, గురువారాల్లో రద్దు కానున్నాయి. తిరువళ్లూర్ గ్యారేజ్‌లో ఈరెండ్రోజులు మరమ్మతులు చేపట్టనుండడంతో సెంట్రల్‌నుంచి తెల్లవారుజామున 4.30 గంటలకు బయల్దేరే రైలు, మరో మార్గంలో తిరువళ్లూర్ నుంచి వేకువజామున 3.50 గంటలకు బయల్దేరే రైళ్లు రద్దు చేసున్నట్లు దక్షిణ రైల్వే ఓ ప్రకటనలో తెలిపింది.

మదురై, నెల్లై రవాణా సంస్థలకు కొత్త అధ్యక్షుడు

ఐసిఎఫ్, జూన్ 17: మదురై, తిరునల్వేలి ప్రభుత్వ రవాణా సంస్థల అధ్యక్షుడు, డైరెక్టర్‌గా డా.ఆర్.సెల్వరాజ్ నియమితులయ్యారు. నిర్వహణ కారణాలతో ఈ రవాణా సంస్థల అధ్యక్షులు, డైరెక్టర్ ఫణీంధర్‌రెడ్డికి బదులుగా రాష్ట్ర రహదారుల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ డా.సెల్వరాజ్‌ను ప్రభుత్వం నియమించింది.

గిరి ప్రదక్షిణకు అనుకూల సమయం

ఐసిఎఫ్, జూన్ 17: ఆణి మాసం గిరి ప్రదక్షిణకు అనుకూల సమయాన్ని ఆలయ నిర్వాహకులు ప్రకటించారు. తిరువణ్ణామలై అరుణాచలేశ్వర ఆలయానికి రాష్ట్రంనుంచే కాకుండా, ఇతర రాష్ట్రాలు, విదేశాలనుంచి భక్తులు స్వామి వారిని దర్శించేందుకు వస్తుంటారు. ముఖ్యంగా పౌర్ణమి రోజుల్లో 14 కి.మీ దూరం కలిగిన గిరి మార్గంలో లక్షలాది మంది భక్తులు ప్రదర్శన చేస్తుంటారు. ఆణి మాసానికి సంబంధించి పౌర్ణమి గిరి ప్రదక్షిణ శుక్రవారం ఉదయం 7.46 గంటల నుంచి శనివారం ఉదయం 7.21 గంటల వరకు భక్తులు గిరి ప్రదర్శన చేయవచ్చని పేర్కొన్నారు.

'యూట్యూబ్' ఛానల్‌పై శిక్షణ

పెరంబూర్, జూన్ 17: స్థానిక గిండీలోని తమిళనాడు ఔత్సాహిక పారిశ్రామికవేత్తల అభివద్ధి సంస్థ కార్యాలయంలో యూట్యూబ్ ఛానల్ ప్రారంభించడంపై శిక్షణ ఇవ్వనున్నారు. బుధవారంనుంచి 21వతేదివరకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5.45 గంటల వరకు జరుగనున్న శిక్షణా తరగతుల్లో యూట్యూబ్ ఛానల్ ప్రారంభించడం, వీడియో, ఫొటోలు అప్‌లోడ్ చేయడం, ఛానల్ ద్వారా ఆదాయం ఆర్జించడం తదితరాలను వివరించనున్నారు. ఆసక్తి కలిగినవారు 044-22252081, 8668100181, 9841336033 అనే నెంబర్లు సంప్రదించవచ్చు.

రేపటినుంచి చదురగిరికి భక్తుల అనుమతి

పెరంబూర్, జూన్ 17: చదురగిరి సుందర మహాలింగం ఆలయంలో ఆణి నెల ప్రదోషం సందర్భంగా ఈనెల 19 నుంచి 21వ తేది వరకు భక్తులు కొండపైకి వెళ్లేందుకు అనుమతించినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ ఆలయంలో 19న ఆణి నెల ప్రదోషం, 21న పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించనున్నారు. ప్రతిరోజు ఉదయం6నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు భక్తులను అనుమతించనున్నారు. భక్తులు ప్లాస్టిక్ వస్తువులు, అగ్నిప్రమాదానికి కారణమ్యే వస్తువులు తీసుకెళ్లరాదని అటవీ శాఖ విజ్ఞప్తి చేసింది.

8వ శతాబ్దం నాటి విగ్రహం లభ్యం



కొట్రవై విగ్రహం

ఐసిఎఫ్, జూన్ 17: చెంగల్పట్టు జిల్లా మధురాంతకం సమీపంలోని తేన్‌పాక్కం శివాలయం వద్ద విరిగిన స్థితిలో 8వ శతాబ్దానికి చెందిన కొట్రవై విగ్రహాన్ని హిందూ మహోన్నత పాఠశాల చరిత్ర ఉపాధ్యాయులు రమేష్, కళాశాల ప్రొఫెసర్ చంద్రశేఖర్ గుర్తించారు. ఈ విగ్రహాన్ని పొడవైన రాతితో మలిచారని, కళాత్మకతో రూపొందించిన ఈ విగ్రహానికి 8 చేతులున్నాయని, సుమారు రెండున్నల అడుగుల వెడల్పు కలిగి ఉందని తెలిపారు. తలపై కిరీటం, తాటాకు చెవిదుద్దులు కలిగి ఉందన్నారు. 8 చేతుల్లో శంఖం, చక్రం, ఖడ్గం, బాణం, విల్లు, కేడెం వంటివి ధరించి ఉన్నాయని, ఈ విగ్రహం 8వ శతాబ్దానికి చెందిందని పేర్కొన్నారు.

వీఐటీ చైర్మన్‌కు సత్కారం



జూన్ 17: న్యూయార్క్ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్న వీఐటీ విద్యా సంస్థ ఛైర్మన్ కె.విశ్వనాథన్‌ను తమిళ సంస్థల ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. స్థానిక సైదాపేటలో ఉన్న తమిళనాడు దూర విద్య సంస్థ ప్రాంగణంలో ఆదివారం ప్రపంచ తమిళ సంఘం అధ్యక్షులు, ప్రముఖ పారిశ్రామికవేత్త వీజీ సంతోషం సారధ్యంలో జరిగిన ఈ ఆత్మీయ సత్కార వేడుకల్లో రాష్ట్ర హిందూ దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు పాల్గొన్నారు. ఆత్మీయ అతిథులుగా ఆర్థిక మంత్రి పీటీఆర్ పళనివేల్ త్యాగరాజన్, డీపీఐ అధ్యక్షుడు తిరుమావళవన్, తమిళనాడు కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షుడు కృష్ణస్వామి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ముత్తరసన్, అన్నాడీఎంకే సీనియర్ నేత పొన్నయ్యన్, పారిశ్రామికవేత్త నల్లికుప్పు స్వామి చెట్టి తదితర ప్రముఖులు హాజరై విశ్వనాథన్‌కు శాలువ కప్పి జ్ఞాపిక బహూకరించి సత్కరించారు.


యోగాసనంతో ప్రపంచ రికార్డు



విపరీత కరణి ఆసనం (అంతర్ చిత్రంలో) కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి స్వామినాథన్

పెరంబూర్, జూన్ 17: మదురై మహామహర్షి ట్రస్ట్ ఆధ్వర్యంలో 'యోగా ప్రపంచ రికార్డు' పేరిట ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 6 నుంచి 60 ఏళ్ల వరకు ఉన్న పిల్లలు, పెద్దలు సుమారు 1,000 మందికి పైగా పాల్గొని విపరీత కరణి (నడుం కింద చేతులుంచి కాళ్లు పైకెత్తడం) ఆసనాన్ని సుమారు 10 నిమిషాలకు పైగా వేసి సాధన చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హైకోర్టు న్యాయమూర్తి జీఆర్ స్వామినాథన్, సాయుధ దళ ఐజీ లక్ష్మి, నటుడు సూరి తదితరులు పాల్గొన్నారు.

రాజరాజచోళుడి విగ్రహం, శిలాశాసనాలు లభ్యం



ఐసిఎఫ్, జూన్ 17: తిరుచ్చి సమీపంలోని ఓ ఆలయంలో రాజరాజచోళుని విగ్రహం, శిలాశాసనాలు లభ్యమయ్యాయి. ఈ జిల్లాలోని దురైమూర్ సమీపంలో ఆలతుడయాన్‌పట్టిలో ఉన్న సౌందరవల్లి తాయారు సమేత సోమనాధర్ శివాలయంలో బాలాలయం జరుగనుంది. ఆలయ ప్రాచీనత, చరిత్ర నమోదుచేసేందుకు శిలాశాసనాల పరిశోధకులు రవికుమార్, పురావస్తు పరిశోధకులుఐ దీపక్ నేతృత్వంలోని బృందాలు ఆలయ శిలాశాసనాలను తనిఖీ చేశారు. రాజరాజచోళుడు, రాజేంద్ర చోళుడు కాలంలో ఆలయం నిర్మించినట్లు తెలిసింది. ఈ విషయమై పరిశోధకులు రవి, దీపక్‌లు మాట్లాడుతూ... ఆలయ శాసనాల ద్వారా రాజేంద్ర చోళుని వారసుడు రాజేంద్రన్, మూడవ రాజరాజన్‌లు ఆలయానికి భూములు దానంగా అందజేశారని, ఆ ఊరికి పెరియ నావలూరు అనే పేరు పూర్వం ఉండేదని తెలిసిందన్నారు. ఆలయ నంది మండపం ఎదుట నమస్కార భంగిమలో నిల్చున్న విగ్రహాన్ని గ్రామస్థులు మునివర్ విగ్రహంగా పేర్కొంటూ పూజలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ విగ్రహం తంజావూరు బృహదీశ్వర ఆలయ చిత్రలేఖనాల్లో ఒకటైన రాజరాజన్ ఆకారంతో సరిపోల్చబడిందని తెలిపారు. త్వరలో ఈ విగ్రహానికి ప్రత్యేక మండపం నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరనున్నట్లు వారు తెలిపారు.

రామన్ గ్రూప్స్ ఎలక్ట్రానిక్ షోరూం ప్రారంభం



వేలూరు, జూన్ 17: స్థానిక కలెక్టర్ కార్యాలయ సమీపంలో ఎస్కే. రామన్ గ్రూప్స్ సెటాక్ ఎలక్ట్రికల్ షోరూం ప్రారంభోత్సవం సోమవారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన వేలూరు శ్రీ లక్ష్మీనరస్వతి బస్సు సర్వీస్, మదర్ ఇండియా ఇఎన్‌టీ క్లినిక్ వైద్యులు డా.విజయ్ గోవింరాజ్ పాల్గొని రిబ్బన్ కత్తిరించి షోరూం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్సార్ స్పోర్ట్స్ ఎస్ఎస్ సిల్క్స్ లక్ష్మీనారాయణన్, ఉమాశంకరి, వీకేఆర్ బిల్డర్స్ పుహళేంది తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా గంగమ్మ శిరస్సు వేడుకలు



వేలూరు, జూన్ 17: స్థానిక కాట్పాడి డివిజన్ ఎల్లీ పుదూర్ గ్రామంలో 21వ వార్షిక సాలై గంగమ్మన్ శిరస్సు వేడుకలు సోమవారం జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, అలంకారం, ఆరాధనలు, దీపారాధన, కాపు కట్టుట, శిరస్సు పురవీధుల్లో ఊరేగించుట తదితరాలు జరిగాయి. భక్తులు దారిపొడవునా కర్పూర హారతులతో గంగమ్మ శిరస్సును ఆహ్వానించారు. కార్యక్రమంలో మేట్టుకుడి ఎస్.పంచాక్షరం, గ్రామ పెద్ద సంతానం, గ్రామ ధర్మకర్త డా.పెరుమాళ్, పిళ్లై శరవణన్ సహా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

మూఢనమ్మకం తెచ్చిన తంటా
మనవడిని హతమార్చిన తాత



నిందితుడు వీరముత్తు

పెరంబూర్, జూన్ 17: మూఢనమ్మకంతో 38రోజుల వయసు గల మనుమడిని హతమార్చిన తాతను పోలీసులు అరెస్ట్ చేశారు. అరియలూరు జిల్లా జయంకొండాం సమీపం ఉడకోట గ్రామానికి చెందిన వీరముత్తు కుమార్తె సంగీతకు కుంభకోణానికి చెందిన బాలమురుగన్‌తో గతేడాది వివాహం జరిగింది. కొద్దిరోజుల క్రితం మగశిశువుకు జన్మనిచ్చిన సంగీత, బిడ్డతోపాటు పుట్టింటికి వచ్చింది. ఈనెల 14వ తేది రాత్రి బిడ్డతో పాటు పడుకున్న సంగీత, మరుసటి రోజు ఉదయం నిద్రలేవగా బిడ్డ కనిపించకపోవడంతో గాలించిగా ఇంట్లో ఉన్న నీళ్ల డ్రమ్ములో బిడ్డ అచేతనంగా పడి ఉండడం చూసి బోరున విలపించింది. ఈ ఘటనపై కేసు నమోదుచేసిన పోలీసులు పలు కోణాల్లో విచారించి చివరకు తాత వీరముత్తును అనుమానించి అదుపులోకి తీసుకొని విచారించారు. చిత్తిరై నెలలో జన్మించిన బిడ్డ ద్వారా తాతకు ప్రాణహాని ఉందని, అలాగే కుటుంబానికి అప్పుల బెడద అధికమవుతుందనే మూఢనమ్మకంతో బిడ్డను నీటి డ్రమ్ములో ముంచి హతమార్చినట్లు వీరముత్తు పోలీసులకు తెలిపాడు. దీంతో, వీరముత్తును అరెస్ట్ చేసిన పోలీసులు కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించారు.

బక్రీద్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు



వేలూరు, జూన్ 17: స్థానిక ఆర్ఎన్ పాళ్యంలోని ఈద్గా మైదానంలో సోమవారం బక్రీద్ పండుగ సందర్భంగా సుమారు 5,000 మంది ముస్లింలు నమాజులో పాల్గొని, ఒకరినొకరు ఆలింగనం చేసుకొని అభినందనలు తెలుపుకున్నారు. పండుగ సందర్భంగా పేదలకు ఖుర్బానీ అందజేశారు. అలాగే, జిల్లాలోని పళ్లికొండ, పేర్నాంబట్టు, గుడియాత్తం, వాణియంబాడి ఖాదర్‌పేట ఈద్గా మైదానం సహా పలు ప్రాంతాల్లో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో వందలాది మంది ముస్లింలు పాల్గొన్నారు.



ట్రిప్లికేన్ పార్థసారథి ఆలయ ప్రాంగణంలో నరసింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల సందర్భంగా ధ్వజారోహణం చేస్తున్న ప్రధానార్చకులు

సెమ్మంజేరిలో మెగా క్రీడా నగరం

ప్యారీస్, జూన్ 16: దక్షిణ చెన్నై శివారులోని మెగా క్రీడా నగరం ఏర్పాటుపై రాష్ట్రప్రభుత్వం టెండరు విడుదల చేసింది. రాజధానిలో ప్రపంచస్థాయిలో మెగా స్పోర్ట్స్ సిటీ ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి స్టాలిన్ 2022వ సంవత్సరం అసెంబ్లీలో ప్రకటించారు. ఆ మేరకు స్థలసేకరణ పనులు చేపట్టిన అధికారులు, సెమ్మంజేరి, వండలూరు, గుండంబాక్కం అనే మూడు ప్రాంతాలను ఎంపిక చేశారు. ఈ మూడింటిలో సెమ్మంజేరి ప్రాంతం అనువుగా ఉందని గుర్తించారు. ఈ క్రీడా సిటీ నిర్మాణ పనులను తమిళనాడు పరిశ్రమల అభివృద్ధి సంస్థ ప్రారంభించింది. ఈ స్పోర్ట్స్ సిటీలో ఒకే సమయంలో వందలాది మంది క్రీడాకారులు శిక్షణలో పాల్గొనవచ్చు. స్విమ్మింగ్ పూల్, బాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, వాలీబాల్ కోర్టులు, జిమ్నాస్టిక్ శిక్షణ కేంద్రాలు, హాకీ స్టేడియం అని 20కి పైగా క్రీడా కోర్టులు ఏర్పాటుకానున్నాయి. క్రీడాకారులు బసచేసేందుకు గదులు, సిబ్బందికి క్వార్టర్స్, హోటల్ తదితర వసతులతో మెగా స్పోర్ట్స్ సిటీ పథకాన్ని రూపొందించారు. ప్రస్తుతం ఈ పథకానికి సంబంధించిన టెక్నాలజీ, ఆర్థికవనరుల సేకరణపై నివేదిక తయారీకి సీఎండీఏ టెండరు ఆహ్వానించింది.

పోలీసు దళ వీరులకు సత్కారం



వేలూరు, జూన్ 17: స్థానిక అన్నాసాలైలో ఉన్న పోలీసు సంక్షేమ జీవన మంద్రంలో సోమవారం కేంద్ర మాజీ సైనికుల సత్కార కార్యక్రమం జరిగింది. వేలూరు, తిరువణ్ణామలై, రాణిపేట, తిరుప్పూర్ జిల్లాలకు కేంద్రంగా ఈ మంద్రం పనిచేస్తోంది. సోమవారం జరిగిన కార్యక్రమానికి విజయకుమార్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో భాగంగా ఛత్తీస్‌ఘడ్‌లో వీరమరణం పొందిన పెన్నతూరుకు చెందిన దేవన్ కుటుంబసభ్యులను నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షుడు తమిళ్ అరసన్, జనరల్ సెక్రటరీ చెల్లస్వామి, కోశాధికారి పూర్ణచంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

21నుంచి వృద్ధులకు ఉచిత బస్ పాస్ టోకెన్లు

పెరంబూర్, జూన్ 17: సీనియర్ సిటిజన్లు ఎంటీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించేలా అందజేస్తున్న టోకెన్లు ఈ నెల 21వ తేది నుంచి పొందవచ్చు. ఈ మేరకు మెట్రో ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎంటీసీ) సోమవారం విడుదల చేసిన ప్రకటనలో.. 60ఏళ్లకు పైబడిన వారు ఎంటీసీ బస్సుల్లో నెలకు 10 సార్లు ఉచితంగా ప్రయాణం చేసేలా టోకెన్లు అందిస్తున్నామన్నారు. గతంలో జనవరి నుంచి జూన్ వరకు టోకెన్లు అందించగా, ప్రస్తుతం జూలై నుంచి డిసెంబరు వరకు టోకెన్లు పంపిణీ చేయనున్నామన్నారు. నగరంలో ఉన్న 42 డిపోల్లో ఈ నెల 21 నుంచి జూలై 31వ తేది వరకు ఈ టోకెన్లు పొందవచ్చని తెలిపారు. కొత్తగా టోకన్లు పొందగోరువారు రేషన్, ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో డిపోల్లోని కౌంటర్లను సంప్రదించాలని ఎంటీసీ తెలిపింది.

ప్రొఫెసర్ మహమ్మద్ రేలాకు జీవన సాఫల్య పురస్కారం ప్రదానం



చెన్నై, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ కాలేయ మార్పిడి శస్త్రచికిత్స నిపుణులు, స్థానిక రేలా ఆసుపత్రి ఛైర్మన్ ప్రొఫెసర్ మహమ్మద్ రేలాను అసోసియేషన్ ఆఫ్ హెల్త్ ప్రొవైడర్స్ ఇండియా (ఏహెచ్‌పిఐ) ఆధ్వర్యంలో ఏర్పాటైన సదస్సులో జీవపసాఫల్య పురస్కారంతో ఘనంగా సత్కరించారు. వైద్య రంగంలో విశిష్ట సేవలందించినందుకు గాను సంస్థ నిర్వాహకులు ఈ అవార్డును ప్రదానం చేశారు.

కాళికాంబాళ్ ఆలయ మాజీ ట్రస్టీకి బెదిరింపు
ప్రధానార్చకుడు సహా ఐదుగురిపై కేసు

చెన్నై, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్యారీస్ కార్నర్ తంబుశెట్టి వీధిలోని కాళికాంబాళ్ ఆలయ కానుకలను అర్చకులు స్వాహా చేసి మోసగిస్తున్నట్లు ఫిర్యాదు చేసిన ఆ ఆలయ మాజీ ట్రస్టీని హతమార్చుతామంటూ బెదిరించిన ప్రధానార్చకులు కాళిదాస్ సహా ఐదుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. చెన్నై వెస్ట్‌మాంబళం ప్రాంతానికి చెందిన విశ్వనాథన్ (58) 2002 నుంచి 2009 వరకు కాళికాంబాళ్ ఆలయ ట్రస్టీగా సేవలందించారు. ఇటీవల ఆ ఆలయంలో మహిళా భక్తులపై లైంగిక వేధింపులకు పాల్పడి పూజారి కార్తీక్ మునుసామి అరెస్టు కావడం కలకలం రేపింది. ఆ ఆలయంలో ప్రధానార్చకుడిగా పనిచేస్తున్న కాళిదాస్ భక్తులిచ్చే విలువైన కానుకలను అపహరించుకెళుతున్నట్లు ఆరోపణలొచ్చాయి. ఈ విషయాన్ని మాజీ ట్రస్టీ విశ్వనాథన్ ఇటీవల ఎన్నికైన నూతన ట్రస్టీకి, ఇతర నిర్వాహకుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ప్రధానార్చకులు కాళిదాస్‌కు, విశ్వనాథన్‌కు మధ్య విరోధాలు తలెత్తాయి. ఈ పరిస్థితులలో ప్రధానార్చకులు, ఆయన సహచరుడైన కార్తీక్ మునుసామి కానుకలను అపహరించిన ఘటనలపై మీడియా ఎదుట విశ్వనాథన్ వెల్లడించేందుకు సిద్ధమయ్యారు. ఈ విషయాన్ని పసిగట్టిన కాళిదాస్ ఈనెల 15 రాత్రి విశ్వనాథన్ బైకుపై అన్నాసాలై మన్రో విగ్రహ ప్రాంతం వద్ద వెళుతుండగా రెండు బైకులలో వెంబడిస్తూ వచ్చిన నలుగురు వ్యక్తులు అడ్డుకుని ఆయనను దుర్భాషలాడారు. వేటకొడవళ్లతో దాడికి ప్రయత్నించారు. అంతటితో ఆగకుండా కాళిదాస్‌కు వ్యతిరేకంగా మీడియా ముందు మాట్లాడితే చంపుతామంటూ హెచ్చరించి పరారయ్యాయ్యారు. ఈ ఘటనపై విశ్వనాథన్ ట్రిప్లికేన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కాళికాంబాళ్ ఆలయ ప్రధానార్చకులు కాళిదాస్ సహా ఐదుగురిపై ఐపీసీ 294(బి)చ 506(1) సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు.



వేలూరు ఎంపీగా విజయం సాధించిన కదిర్ ఆనంద్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్న జిల్లా ఎస్పీ మణివన్నన్

వెల్లివిరిసిన మత సామరస్యం



ముస్లింలకు స్వీట్లు అందజేస్తున్న హిందువులు

పెరంబూర్, జూన్ 17: తిరుప్పూర్‌లో బక్రీద్ పండుగ సందర్భంగా ఇస్లామీయులకు వినాయకుడి ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో స్వీట్లు అందించారు. తిరుప్పూర్ ముదలిపాళయం హౌసింగ్ యూనిట్ ప్రాంతంలో సెల్వ వినాయకుడి ఆలయం ఉంది. కొద్దిరోజుల క్రితం ఈ ఆలయ కుంభాభిషేకం కోలాహలంగా జరిగింది. ఆ సమయంలో ఆ ప్రాంతంలోని ముస్లింలు సారె తీసుకుని ఆలయానికి ఊరేగింపుగా వచ్చి ఆలయ నిర్వాహకులకు అందజేశారు. ఈ నేపథ్యంలో, సోమవారం బక్రీద్ పండుగ సందర్భంగా పెద్ద మసీదు ప్రాంగణంలో ప్రార్థనలు పూర్తిచేసుకొని వస్తున్న ముస్లింలకు వినాయకుడి ఆలయ నిర్వాహకులు రోజా పూలతో శుభాకాంక్షలు తెలుపుతూ, స్వీట్లు అందజేశారు. ఈ ప్రాంతంలో హిందూ, ముస్లింలు మతబేధాలు లేకుండా కలసి ఉంటారని నిరూపితమైందని పలువురు సంఘ శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఒట్టాన్‌సత్రం పారిశ్రామికవాడను వ్యతిరేకిస్తూ
అసెంబ్లీలో సావధాన తీర్మానం

ఈపీఎస్ ప్రకటన

ప్యారీస్, జూన్ 17: మదురై-కోయంబత్తూర్ మార్గంలో ఒట్టాన్‌సత్రం మండలం అభియంపట్టణం ప్రాంతంలో పారిశ్రామికవాడ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో సావధాన తీర్మానం ప్రవేశపెట్టనున్నట్లు అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి పేర్కొన్నారు. అభియంపట్టి నాలుగు రోడ్ల గ్రామంలో అన్నాడీఎంకే ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాల్గొనేందుకు సోమవారం ఉదయం వెళ్లిన పళనిస్వామిని పార్టీ శ్రేణులు ఘనంగా స్వాగతించారు. ఈసందర్భంగా ఆయనమీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రంలోని పలు జిల్లాలకు, విదేశాలకు కూరగాయలు పెద్దమొత్తంలో ఎగుమతి చేస్తున్న ప్రాంతంగా ఒట్టాన్‌సత్రం పేరుగాంచిందని, అన్నదాతలను నష్టపరిచేలా ఈ ప్రాంతంలో డీఎంకే ప్రభుత్వం పారిశ్రామికవాడను ఏర్పాటుచేసేందుకు చర్యలు చేపట్టిందని, దీనిని అడ్డుకోవాల్సిందిగా స్థానిక రైతులు, జిల్లా పార్టీ నిర్వాహకులు తన వద్ద విజ్ఞప్తి చేశారని తెలిపారు. అసలే సాగునీరు లేక పంటలు పండించుకోని దయనీయ స్థితిలో రైతులు అష్టకష్టాల పాలవుతున్నారని, వారి బాగోగుల గురించి పట్టించుకోని రాష్ట్రప్రభుత్వం వారిజీవనోపాధి దెబ్బతీసేలా వ్యవహరించడం సరికాదన్నారు. ఒట్టాన్‌సత్రంలో పారిశ్రామికవాడ ఏర్పాటును వ్యతిరేకిస్తూ ఈనెల 20వతేది ప్రారంభంకానున్న అసెంబ్లీ సమావేశాల్లో అన్నాడీఎంకే తరపున సావధాన తీర్మానం ప్రవేశపెడతామని, ఆ తర్వాత కూడా ప్రభుత్వం ఈ సమస్యపై స్పందించకుంటే రైతులతో కలసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఎడప్పాడి హెచ్చరించారు.

మూడు నెలల్లో రెండు పులుల మృతి

ఐసిఎఫ్, జూన్ 16: రాష్ట్రంలో మూడు నెలల్లో రెండు ఆడ పులులు మరణించడంపై అటవీ శాఖ అధికారులు విచారణ జరుపుతున్నారు. గత 2022లో చేపట్టిన సర్వే ప్రకారం రాష్ట్రంలో 306 పులులుండగా, 2023లో వివిధ ఘటనల్లో 15 పులులు మృతిచెందాయని అధికారులు తెలిపారు. గత ఏప్రిల్ 24వ తేది కలక్కాడు ముండతురై పులుల శరణాలయంలో కులశేఖరం అనే ప్రాంతంలో ఓ ఆడ పులి, కోయంబత్తూర్ సిరుముగై వల్లియూర్ కాపుక్కాడు ప్రాంతంలో మరో ఆడ పులి కళేబరాలను అటవీ శాఖ సిబ్బంది గుర్తించారు. వీటి మరణాలకు సంబంధించిన కారణాలపై విచారణ జరుగుతోంది.

నేడు పనిచేయని మురుగునీటి తొలగింపు కేంద్రాలు

పెరంబూర్, జూన్ 17: స్థానిక మాధవరం మండలంలో మురుగునీటి ప్రధాన పైపులు మార్పే పనులు చేపట్టనున్నారు. ఈ కారణంగా మంగళవారం ఉదయం నుంచి 20వ తేది వరకు మాధవరం, తిరువికనగర్, అంబత్తూర్, అన్నానగర్ మండలాల్లో మురుగునీటి తొలగింపు కేంద్రాలు పనిచేయవు. ఆ సమయంలో యంత్రాలు వినియోగించి మురుగునీరు తొలగించనున్నారు. రోడ్లపై మురుగునీరు చేరితే 8144930903 (మాధవరం), 81449309096 (తిరువిక నగర్), 8144930907 (అంబత్తూర్), 8144930908 (అన్నానగర్) నెంబర్లకు ఫిర్యాదు చేయాలని మెట్రోవాటర్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

మాజీ మంత్రి కేపీ అన్బళగన్‌పై సందేహం
పోలీసులకు మృతుడి భార్య ఫిర్యాదు

అడయార్, జూన్ 17: వాహనం ఢీకొని తన భర్త కృష్ణమూర్తి మృతి చెందిన కేసులో మృతుడి భార్య రాష్ట్ర మాజీ మంత్రి, అన్నాడీఎంకే సీనియర్ నేత కేపీ అన్బళగన్‌పై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ధర్మపురి జిల్లా పాపిరెడ్డిపట్టి, మేలయానూరు ప్రాంతానికి చెందిన కృష్ణమూర్తి (41) అనే వ్యక్తి యూనియన్ అధ్యక్షుడుగా ఉన్నారు. ఈయన ఆదివారం వ్యక్తిగత పనులపై ద్విచక్ర వాహనంపై ధర్మపురి - కృష్ణగిరి జాతీయ రహదారిపై వెళుతుండగా, ఓ వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కృష్ణమూర్తిని ధర్మపురి ఆస్పత్రిలో చేర్చగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. తన భర్త మరణం వెనుక మాజీ మంత్రి కేపీ అన్బళగన్ హస్తం ఉందని మృతుని భార్య కవిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. కాగా, ఈ ప్రమాదంపై కారియమంగళం పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

'ఆది కామాక్షి అమ్మవారి ఆలయ చరిత్ర' పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణలో అతిథులు, నిర్వాహకులు

వేలూరు, జూన్ 17: తమిళనాడు విశ్వకర్మ స్నేహితుల సంక్షేమ సంఘం వేలూరు, కాంచీపురం జిల్లాల శాఖల ఆధ్వర్యంలో 'ఆది కామాక్షి అమ్మవారి ఆలయ చరిత్ర' పుస్తకావిష్కరణ సోమవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ట్రస్టీ ఏలుమలై ఆచారి అధ్యక్షత వహించగా, సంఘ జాయింట్ ఆర్గనైజర్ సతీష్ ఆహ్వానం పలికారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న విశ్వకర్మ జగద్గురు శివరాజ్ జ్ఞాన ఆచార్య గురుస్వాములు పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాంచీపురం జిల్లా నిర్వాహకులు కదిర్‌వేలు, నరసింహన్, దొరైవేల్, కన్నన్, ట్రస్టీ కమిటీ సభ్యులు నరేంద్ర ఆచారి, శంకరఆచారి, సెక్రటరీ జనార్ధనన్, అధ్యక్షుడు తేజోమూర్తి, ఆర్గనైజర్ నటరాజన్ తదితరులు పాల్గొన్నారు. 16 పేజీలతో కూడిన ఈ పుస్తకాన్ని భక్తులకు ఉచితంగా అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

మేట్టూరు డ్యాంకు తగ్గిన ఇన్‌ఫ్లో

ఐసిఎఫ్, జూన్ 17: మేట్టూరు డ్యాంకు నీటి చేరిక 103 ఘనపుటడుగులకు తగ్గింది. ఈ డ్యాం ద్వారా సేలం, నామక్కల్ సహా 12 జిల్లాల్లో 16.5 లక్షల ఎకరాల భూములు సాగవుతున్నాయి. అలాగే, ఆ జిల్లాల ప్రజల తాగునీటి వనరుగా ఈ డ్యాం ఉంది. ప్రస్తుతం ఇన్‌ఫ్లో లేకపోవడంతో నీటిమట్టం వేగంగా తగ్గుతోంది. సోమవారం ఉదయం డ్యాంకు నీటి చేరిక సెకనుకు 114 ఘనపుటడుగుల నుంచి 103 ఘనపుటడుగులకు తగ్గింది. తాగునీరు అవసరాలకు సెకనుకు 1,500 ఘనపుటడుగుల నీరు విడుదల చేస్తున్నారు. ఇన్‌ఫ్లో కన్నా నీటి విడుదల ఎక్కువగా ఉండడంతో ఉదయం 8 గంటల సర్వే ప్రకారం, నీటిమట్టం 42.39 అడుగులకు తగ్గింది. నీటినిల్వలు 13.35 టీఎంసీలుగా ఉన్నట్లు జలవనరుల శాఖ అధికారులు తెలిపారు.

విరివిగా సామాజిక సేవా కార్యక్రమాలు : అర్జున్ రంగా



చెన్నై, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): అగరువత్తుల తయారీలో పేరుగడించిన సైకిల్ ప్యూర్ అగర్బత్తీ సంస్థ వజ్రోత్సవాల సందర్భంగా సంస్థకు అనుబంధంగా ఉన్న చారిటబుల్ ట్రస్ట్ ఎన్ఆర్ ఫౌండేషన్ ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలను భారీయెత్తున నిర్వహించనున్నట్లు ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ అర్జున్ రంగా తెలిపారు. నగరంలో ఏర్పాటైన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిరుపేద మహిళలు, బలహీన వర్గాలకు చెందిన వ్యక్తులకు, దివ్యాంగులకు ఆర్థిక సాధికారికత కల్పించే దిశగా ముమ్మర సహాయ కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. దివ్యాంగుల కోసమే రంగారావు మెమోరియల్ స్కూలును కూడా నడుపుతున్నామని తెలిపారు. 1948లో ప్రారంభమైన తమ సంస్థ దేశవిదేశాల్లో 1.20 కోట్ల మంది కస్టమర్లను కలిగి ఉన్న ఏకైక సంస్థ తమదేనని ఆయన వివరించారు.

మృతుల కుటుంబాలకు సీఎం ఆర్థిక సాయం

పెరంబూర్, జూన్ 16: రాష్ట్రంలో వేర్వేరు ప్రమాదాల్లో మృతిచెందిన నలుగురి కుటుంబాలకు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆర్థికసాయం ప్రకటించారు. రామనాథపురం జిల్లా మండపం నుంచి ఈ నెల 15న చేపల వేటకు సముద్రంలోకి వెళ్లిన సమయంలో హఠాత్తుగా పడవ మరమ్మతులకు గురై నీటమునిగి ఘటనలో ఆరోగ్యం, పరకతుల్లా, కలీల్ రెహ్మాన్‌లు మృతిచెందారు. అలాగే, తిరువారూర్ జిల్లా మన్నార్‌గుడి సమీపంలోని బాణసంచా తయారీ కేంద్రంలో ఆదివారం అగ్నిప్రమాదం సంభవించి సతీష్‌కుమార్ అనే యువకుడు మృతిచెందాడు. ఈ ఘటనలపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి, మృతుల కుటుంబాలకు సానుభూతి తెలుపడంతో పాటు తలా రూ.3 లక్షలు అందించాలని ఉత్తర్వులు జారీచేసినట్లు సచివాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

బంగారం స్మగ్లింగ్ ముఠా అరెస్ట్

ప్యారీస్, జూన్ 17: మలేసియా నుంచి టి.నగర్‌కు అక్రమంగా బంగారం తరలించిన నలుగురిని నగర పోలీసులు ఆదివారం అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.50 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. దక్షిణాసియా దేశాల నుంచి టి.నగర్ పాండి బజార్‌లో ఉన్న ఓ జ్యువెలరీ షాపులో పనిచేస్తున్న సిబ్బందికి మలేసియా వ్యక్తి ద్వారా బంగారం సరఫరా చేస్తున్న ముఠా గుట్టు ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసుల కథనం మేరకు.. రెండు వారాల క్రితం మలేసియాకు చెందిన నలుగురు వ్యక్తులు వారి దేశానికి వెళ్లేందుకు స్థానిక అంతర్జాతీయ విమానాశ్రయానికి వచ్చారు. వారి బ్యాగులు తనిఖీచేసిన కస్టమ్స్ అధికారులు, ఇండియన్ కరెన్సీ నోట్ల కట్టలు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన రూ.50 లక్షల కరెన్సీ హవాలా సొమ్ముగా అనుమానించి, ఆ కోణంలో విచారణ చేపట్టారు. కోర్టు ఉత్తర్వుల మేరకు ఈ కేసును ఆదాయపుపన్ను శాఖకు బదిలీ చేసినట్లు కస్టమ్స్ అధికారులు తెలిపారు.

మత్తు మాత్రల విక్రయ ముఠా అరెస్టు

అడయార్, జూన్ 17: ముంబై నగరం నుంచి మత్తుమాత్రలను దిగుమతి చేసుకుని నగరంలో విక్రయిస్తున్న ఓ ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో కోడంబాక్కం ప్రాంతానికి చెందిన మణిభారతి (22), క్రోంపేటకు చెందిన జీవా (28), ప్రవీణ్ కుమార్ (23), కాట్టుప్పాక్కంకు చెందిన ఆరిష్ (21) తదితరులు ఉన్నారు. వీరి నుంచి 800 మత్తు మాత్రలతో పాటు 4 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

మాంజోలై భవిష్యత్ ఏమిటి ?

● ఉన్నఫలంగా ఉపాధి కోల్పోయి బతుకు భారమై కదులుతున్న కార్మికులు


● కన్నీటి కడలిలో 'మాంజోలై' కష్టజీవులు



మాంజోలై ఎస్టేట్ ప్రాంతం

(ఆంధ్రజ్యోతి, చెన్నై)

తాతముత్తాల కాలం నుంచి చల్లటి వాతావరణంలో, ప్రకృతి మాత ఒడిలో పెరిగి, అక్కడే తేయాకు ఎస్టేట్‌లో పనిచేస్తూ జీవనం సాగించిన 'మాంజోలై' కార్మికులు నేడు బతుకు భారమై, భవిష్యత్తు ఏమయిపోతుందోననే భయంతో వణికిపోతూ, కన్నీటిని దిగమింగుకుంటూ ఆ ప్రాంతాన్ని విడచి వెళుతున్నారు. తమ తాతముత్తాలు, తాము ఎలా ఎస్టేట్‌లో పనిచేశామో, ఎన్నికష్టాలు పడ్డామో ఆ పాత సంగతులు చెప్పుకుంటూ కొండపై నుంచి గుంపులు గుంపులుగా కిందకు దిగుతున్నారు. అదే సమయంలో పచ్చదనం పరచుకున్న ఆ ప్రాంతంలో చిన్ననాట ఎక్కడెక్కడ తిరిగామో, ఎన్ని ఆటలు ఆడుకున్నామో ఆ నాటి బంగారు బాల్యపు సంగతుల్ని కూడా నెమరవేసుకుని మరీ భారమైన గుండెతో కన్నీటి పర్యంతమై వెళుతున్నారు. ఆ తేయాకు ఎస్టేట్‌లో ఐదో తరానికి చెందినవారే ప్రస్తుతం ఉన్నఫలంగా ఉపాధి కోల్పోయి, మరో ఉపాధి కోసం వెదుక్కుంటూ కొండదిగి పోతున్నారు. ఇలా మాంజోలై తేయాకు ఎస్టేట్ కార్మిక కుటుంబాలన్నీ ఇతర ప్రాంతాలకు వలసపోవాల్సిన అగత్యం ఎందుకు ఏర్పడింది? ఆ తేయాకు ఎస్టేట్‌ను నడుపుతున్నవారెవరు? నాలుగుతరాలకు చెందిన వేలాదిమంది కార్మికులందరికీ ఆశ్రయమిచ్చిన మాంజోలై భవిష్యత్ ఏమిటి? పచ్చటి ఆ కొండపై ఇక మానవమాత్రులకు తావుండదా? మాంజోలై వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకోనున్న చర్యలేమిటి? ఈ ప్రశ్నలన్నింటికి సమాధానాలు తెలుసుకోవాలంటే మాంజోలై పాత చరిత్రను తిరగేయాలి.



కార్మికులు, ఉద్యోగులు నివాసగృహాలు



శోకవదనంతో నిలిచిన మహిళా కార్మికులు

అంతటా పచ్చదనం...

పడమటిపర్వత కనుమలలో సుమారు 4300 అడుగుల ఎత్తులో ఉంది మాంజోలై ఎస్టేట్. ఎటు చూసినా కళ్ళకు ఇంపైన పచ్చదనమే కనువిందు చేస్తుంది. ఏపుగా పెరిగిన చెట్లతో ఏటవాలు భూముల్లో తేయాకు తోటలతో అంతటా పచ్చదనంతో కళకళలాడుతుంది. తెన్‌కాశి జిల్లాలోని కుత్రాలం జలపాతం వద్ద మూలికల జలధారల్లో స్నానం చేసే పర్యాటకులు తమిళనాడు, కేరళలో ఉన్న పర్యాటక పర్వత ప్రాంతాలను కూడా సందర్శించటం ఆనవాయితీ. అలా సందర్శించే ప్రాంతాల్లో మాంజోలై తేయాకు ఎస్టేట్‌దే అగ్రస్థానం. అక్కడి అందాలు అందరినీ మైమరపిస్తాయి. ఆ ప్రాంతంలో ఇంతటి పచ్చదనం ఎలా వచ్చిందని అందరూ ఆశ్చర్యపోతుంటారు. అంబాసముద్రం చేరువగా ఉన్న సింగంపట్టి జమీన్ నుంచి 1929 ఫిబ్రవరి 12న 'ది బాంబే బర్మా ట్రేడింగ్ కార్పొరేషన్' అనే సంస్థ దట్టమైన ఆ అటవీ ప్రాంతంలో 8374 ఎకరాల విస్తీర్ణం కలిగిన ప్రాంతాన్ని 99 యేళ్లకు లీజుకు తీసుకుంది. తిరునల్వేలి, తూత్తుకుడి జిల్లాల నుంచి, సమీపంలో ఉన్న కేరళ రాష్ట్రం నుంచి కార్మికులను తెప్పించి ఆ అటవీ ప్రాంతాన్ని అందమైన తేయాకు ఎస్టేట్‌గా మార్చింది. తేయాకుతోపాటు కాఫీ పంటలు, ఏలకులు, మిరియాల పంటలను కూడా సమృద్ధిగా పండిస్తోంది.



తేయాకు సేకరణలో కార్మికులు

సీఎంతో చర్చిస్తా : స్పీకర్



తిరునల్వేలి మాంజోలై తేయాకు ఎస్టేట్ వ్యవహారంలో కార్మికులకు మేలు జరిగేలా రాష్ట్ర ప్రభుత్వం తగు నిర్ణయం తీసుకుంటుందని స్పీకర్ అప్పావు ఆశాభావం వ్యక్తం చేశారు. మాంజోలై ఎస్టేట్‌లో రాష్ట్రానికి చెందిన కార్మికులు సంచరిస్తేనే అటవీ శాఖకు, మనకు మంచిదని, కేరళ అటవీ ప్రాంతంలో ఉగ్రవాదులు శిక్షణ పొందుతుంటారని వార్తలు వెలువడుతున్న నేపథ్యంలో మాంజోలైలో మన కార్మికులు ఉండటం శ్రేయస్కరమని పేర్కొన్నారు. తేయాకు ఎస్టేట్ ప్రాంతాన్ని పూర్తిగా అటవీ శాఖకు అప్పగించడం సబబుగా ఉండదని చెప్పారు. కార్మికులు మునుపటిలా అక్కడే తమ జీవనం సాగించేలా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. ఈ వ్యవహారాన్ని ముఖ్యమంత్రి స్టాలిన్ దృష్టికి తీసుకెళతానని చెప్పారు. సంస్థ కార్మికులను ఖాళీ చేయించడానికి వారి ఇళ్ళకు విద్యుత్, తాగునీటి సరఫరా నిలిపివేయడం మంచి పద్ధతి కాదని పేర్కొన్నారు.

రిజర్వు ఫారెస్టుగా మార్పు...

ఈ ఎస్టేట్ చుట్టూ మాంజోలై, కాక్కాచ్చి, నాలుముక్కు, ఊత్తు, కుదిరైవెట్టి అనే ప్రాంతాలలో టీ ఎస్టేట్‌లలో ఐదువేల మంది కార్మికులు పనిచేసేవారు. ప్రస్తుతం అక్కడ వెయ్యిమంది మంది మాత్రమే నివసిస్తున్నారు. గత శతాబ్దకాలంగా ఆ పర్వత ప్రాంతం కార్మికుల కుటుంబాలతో ఎల్లప్పుడూ సందడిగా ఉండేది. వారి కోసం ఆ చోట రేషన్ దుకాణాలు, రెండు ప్రాథమిక పాఠశాలలు, ఉన్నత పాఠశాలలు, శిశు సంరక్షణ కేంద్రం, ఆలయం, చర్చి, మసీదు అంటూ అన్నీ ఏర్పాటయ్యాయి. ప్రస్తుతం ఐదో తరానికి చెందిన కార్మికుల కుటుంబాలు ఆ ప్రాంతాల్లో నివసిస్తున్నాయి. ఈ నేపథ్యంలో 2018 ఫిబ్రవరి 28న రాష్ట్ర ప్రభుత్వం మాంజోలై ఎస్టేట్‌లో ఉన్న 8374 ఎకరాలతోపాటు మొత్తం 23 వేల ఎకరాల స్థలాన్ని రిజర్వు ఫారెస్టుగా మార్చుతూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆ స్థలానికి పట్టా కోరుతూ బాంబే బర్మా ట్రేడింగ్ కార్పొరేషన్ దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయస్థానం తోసిపుచ్చింది. లీజుకాలం ముగియనున్న 2028లోపు మాంజోలై తేయాకు ఎస్టేట్ ప్రాంతాన్ని ప్రభుత్వ పరం చేయాలని కూడా తీర్పు వెలువరించింది. ప్రస్తుతం ఆ సంస్థ దశలవారీగా కార్మికులకు నష్టపరిహారం చెల్లించి ఎస్టేట్ ప్రాంతం నుంచి పంపించేస్తోంది. 'తరతరాలుగా చల్లటి వాతావరణం కలిగిన కొండ ప్రాంతంలో జీవనం సాగించాం. తేయాకు పనులు తప్ప మరే పనులు తెలియని మేం ఇకపై ఎలా జీవించగలం' అంటూ కార్మికులు ప్రశ్నిస్తున్నారు. ఉన్నఫలాన బతుకుతెరువు కోసం కొండపై నుంచి దిగి మామూలు ప్రాంతాల్లో పనిచేయడం ఎలా కుదురుతుంది? ప్రభుత్వం ఈ ఎస్టేట్‌ను రిజర్వు ఫారెస్టుగా మార్చటానికి బదులుగా నీలగిరి, కోయంబత్తూరు జిల్లాల్లో ప్రభుత్వ తేయాకు ఎస్టేట్ ప్రాంతాల్లో శ్రీలంక శరణార్థులకు ఉపాధి కల్పించినట్లే మాంజోలై ఎస్టేట్‌ని ప్రభుత్వమే నడిపి తమను ఆదుకోవాలని కార్మిక కుటుంబాలన్నీ డిమాండ్ చేస్తున్నాయి. మరో వైపు వాల్పారై, ఊటీ వంటి ప్రాంతాల్లో ఉన్న ఎస్టేట్‌లో ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించేందుకు సంస్థ ముందుకొచ్చింది. ఈ విషయమై సంస్థ యాజమాన్యం, కార్మికులతో పలు మార్లు చర్చలు కూడా జరిపింది. ఫలితం శూన్యమైంది. నష్టపరిహారాలు తీసుకుని మాంజోలైని ఖాళీ చేయాలంటూ కార్మికులను ఖాళీ చేయిస్తోంది. నాలుగు రోజులకు ముందు కార్మికులు బోరున విలపిస్తూ తమ తాత ముత్తాల నాటి నుంచి నివసించిన ఆ ప్రాంతం నుంచి బరువెక్కిన గుండెభారంతో వెళ్ళిపోయారు. వందేళ్లకు పైగా తేయాకు ఎస్టేట్ కార్మికులతో, పర్యాటకులతో కళకళలాడిన మాంజోలై త్వరలో జనసంచారానికి తావులేని రిజర్వు ఫారెస్టుగా మారిపోనుంది. తేయాకు కార్మికులు, వారి పిల్లలు సంచరించిన మాంజోలైలో ఇక పక్షులు, వన్య మృగాలు మాత్రమే సంచరించబోతున్నాయి.

లీజు ఒప్పందం ఎలా కుదిరింది?

తిరునల్వేలి నుంచి 60 కిలోమీటర్ల దూరంలో, తెన్‌కాశి నుంచి 66 కిలోమీటర్ల దూరాన మాంజోలై తేయాకు ఎస్టేట్ ప్రాంతం ఉంది. సింగంపట్టి జమీందార్లకు చెందిన మాంజోలై అటవీ ప్రాంతం మణిముత్తారు ఉపరితలంలో పడమటి కనుమలలో ఉంది. ఈ ప్రాంతానికి భారీ వాహనాలు, ద్విచక్రవాహనాలు వెళ్లలేవు. కారు, జీపులు మాత్రమే వెళ్లగలవు. ఆ వాహనాలలో వెళ్లేందుకు అంబాసముద్రం పులుల అభయారణ్యం డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయంలో అనుమతి పొందాల్సి ఉంటుంది. ఈ ప్రాంతంలో కుదిరైవెట్టి, కాక్కాచ్చి సహా ఐదు తేయాకు తోటలు ఉన్నాయి. సముద్ర మట్టానికి సుమారు 4వేల అడుగులకు పైగా ఎత్తున ఉన్న ఈ పర్వత ప్రాంతం పచ్చదనంతో విలసిల్లుతోంది.

జమీందార్ల వశం...

తిరువనంతపురం తిరువిదాంకూరు యువరాజు మార్తాండ వర్మకు, అయన బంధువైన ఎట్టువీట్టుపిళ్లైకి 1700 సంవత్సరంలో వివాదం నెలకొంది. ఆ ఆధిపత్య పోరులో ఎట్టువీట్టు పిళ్లైయార్ అధికారాన్ని చేజిక్కించుకున్నారు. అప్పటి యువరాజు చేరన్ మార్తాండ వర్మన్ ప్రాణాలకు ముప్పువాటిల్లుతుందనే భయంతో రాణి ఉమయమ్మా అతడిని అడవుల్లోకి తీసుకెళ్ళి దాచిపెట్టి సంరక్షించింది. ఆ సమయంలో వారికి సింగంపట్టి జమీందారుతో పరిచయం ఏర్పడింది. సింగంపట్టి జమీందారు సహకారంతో రాణి ఉమయమ్మా పోరు సాగించి 1730లో పోగొట్టుకున్న రాజ్యాన్ని గెలుచుకుంది. తనకు సాయమందించిన సింగంపట్టి జమీందారుకు మార్తాండవర్మ 74 వేల ఎకరాల భూమిని కానుకగా ఇచ్చారు. అప్పటి నుంచి ఆ ప్రాంతాన్ని సింగంపట్టి ఎస్టేట్ అని పిలుస్తున్నారు.

బాంబే బర్మా ట్రేడింగ్ కార్పొరేషన్...

సింగంపట్టి 32వ జమీందారు చెన్నై నగరంలో చదువుతున్నప్పుడు ఓ హత్యకేసులో చిక్కుకున్నారు. ఆ కేసు నుంచి బయటపడేందుకు లక్షలాది రూపాయలు అవసరమైంది. దీనితో సింగంపట్టి ఎస్టేట్‌లో సుమారు 8 వేల ఎకరాల భూములను బాంబే బర్మా ట్రేడింగ్ కార్పొరేషన్‌కు 99 సంవత్సరాల లీజుకు ఇచ్చారు. ఆ తర్వాత బాంబే బర్మా ట్రేడింగ్ కార్పొరేషన్ సంస్థ కరైయారు, పాపనాశం ఆనకట్ట ప్రాంతాల పైనున్న అటవీ ప్రాంతంలో 3350 నుంచి 4920 అడుగుల ఎత్తున మాంజోలై, కాక్కాచ్చి, నాలుముక్కు, ఊత్తు, కుదిరైవెట్టి అనే నాలుగు ఎస్టేట్‌లను రూపొందించింది. ఆ ప్రాంతాల్లో తేయాకు, కాఫీగింజలు, ఏలకులు, కొయనా మిరియాల పంటలు పండించింది. స్వాతంత్ర్యానంతరం జమీందార్ల ఆధీనంలో ఉన్న రైత్వారీ భూములన్నీ ప్రభుత్వ వశమయ్యాయి. అయితే బాంబే బర్మా ట్రేడింగ్ కార్పొరేషన్ సంస్థ ప్రభుత్వంతో తన లీజు ఒప్పందాన్ని రెన్యూవల్ చేసుకుంది. ఎస్టేట్ పనుల కోసం తిరునల్వేలి, తూత్తుకుడి, తెన్‌కాశి జిల్లాల నుంచి కేరళ నుంచి కంగాణీల (దళారీల) ద్వారా కూలీ పనులను కార్మికులను తెప్పించింది. ఆ కార్మికులందరికీ ప్రస్తుతం మాంజోలైగా పిలుస్తున్న ఆ తేయాకు ఎస్టేట్ ప్రాంతం స్థిరనివాసంగా మారింది. నాలుగు తరాలుగా వీరందరూ తేయాకు ఎస్టేట్‌లో కూలీలుగా పనిచేస్తున్నారు. 1980 దశకాలంలో వీరి కూలి స్వల్పంగా ఉండడంతో రాజకీయ పార్టీల నాయకులు వారి కూలీల పెంపుకోసం, పింఛన్‌కోసం పలు పోరాటాలు నిర్వహించాయి. 1999లో పుదియతమిళగం పార్టీ నేత కృష్ణసామి, టీఎంసీ, సీపీఐ, సీపీఎం పార్టీలు కలిసికట్టుగా ఆందోళనలు జరిపారు. ఆ ఆందోళనలో పోలీసులు లాఠీ చార్జి చేయడంతో పలువురు కార్మికులు ప్రాణభయంతో పరుగెత్తి తామ్రభరణి వాగులోకి దూకారు. వారిలో 17 మంది నీట మునిగి దుర్మరణం చెందారు. 500 మందికిపైగా గాయపడ్డారు. ఆ ఉద్యమం చరిత్రలో బ్లాక్ డేగా చోటుచేసుకుంది. రాజకీయ ఉద్యమాల కారణంగా ఆ కార్మికుల వేతనాలు పెరిగాయి. వారి జీవితాలు మెరుగయ్యాయి. అంతా సవ్యంగా సాగుతుండగా లీజు ఒప్పందం ముగియడానికి రెండేళ్లకు ముందే బాంబే బర్మా ట్రేడింగ్ కార్పొరేషన్ సంస్థ తేయాకు ఎస్టేట్‌లో పనిచేస్తున్న కార్మికులను ఖాళీ చేయిస్తోంది.



ది బాంబే బర్మా ట్రేడింగ్ కార్పొరేషన్ బోర్డు

ఆ కార్మికులను ప్రభుత్వమే కాపాడాలి: కృష్ణసామి



మాంజోలై తేయాకు ఎస్టేట్ కార్మికులను కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని పుదియ తమిళగం నేత డాక్టర్ కృష్ణసామి డిమాండ్ చేశారు. బాంబే బర్మా ట్రేడింగ్ కార్పొరేషన్ సంస్థ నడుపుతున్న ఆ తేయాకు ఎస్టేట్‌లో 2500 మంది పర్మనెంట్ కార్మికులు, 5వేల మంది తాత్కాలిక కార్మికులు పనిచేస్తుండేవారని, ప్రస్తుతం లీజు గడువు ముగియడానికి రెండేళ్లున్నప్పటికీ కార్మికులను ఖాళీచేయించే పనులను ఆ సంస్థ చేపడుతుండటం గర్హనీయమని పేర్కొన్నారు. చాలామంది కార్మికులను స్వచ్ఛంద పదవీ విరమణ పేరుతో పనుల నుండి తొలగిస్తోందని ఆరోపించారు. 45 రోజులలోపున ఎస్టేట్ ప్రాంతాన్ని విడిచి వెళ్ళాలని కూడా కార్మికులందరికీ నోటీసులు జారీ చేసిందని, ఈ దయనీయ పరిస్థితుల్లో కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం కాపాడాల్సిన అవసరం ఉందన్నారు.

చిత్రజ్యోతి



తాన్య రవిచంద్రన్

గ్లామర్ వైపు 'తాన్య' దృష్టి

సీనియర్ నటుడు రవిచంద్రన్ మనుమరాలిగా చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టి హోమ్లీ గర్ల్‌గా ముద్రవేసుకున్న తాన్య రవిచంద్రన్ దృష్టి ఇపుడు గ్లామర్ వైపు మళ్ళింది. ఇప్పటివరకు ఎంతో సంప్రదాయబద్ధమైన పాత్రలను ఎంచుకుంటూ సినీ కెరీర్‌ను కొనసాగిస్తున్న ఈ ముద్దుగుమ్మ ఇపుడు ఎక్స్‌పోజింగ్ చేసేందుకు సిద్ధమయ్యారనే వార్తలు వినిపిస్తున్నాయి. దీనికి కారణం లేకపోలేదు. ఇపుడు రూపొందుతున్న ప్రతి సినిమాలో గ్లామర్ తప్పనిసరిగా మారింది. దీంతో ఆమె కూడా అటువైపు దృష్టిసారించినట్టు సమాచారం. ఇటీవల అర్జున్ దాస్ 'రసవాది' చిత్రంలో తాన్య పాత్రకు మంచి మార్కులతో పాటు ప్రశంసలు కూడా దక్కాయి. ప్రస్తుతం అరుణ్ విజయ్‌తో కలిసి 'రెట్టతల'లో నటిస్తున్నారు. ఇప్పటివరకు హోమ్లీగర్ల్‌గా కనిపించిన తాన్య... గ్లామర్ పాత్రల్లో నటించేందుకు సైతం సమ్మతించినట్టు తెలుస్తుంది.

ఫాంటసీ డ్రామాగా 'రాకెట్ డ్రైవర్'



'రాకెట్ డ్రైవర్' ఫస్ట్‌లుక్

స్టోరీస్ బై ది షోర్ పతాకంపై నిర్మాత అనిరుధ్ వల్లభ్ కొత్తగా 'రాకెట్ డ్రైవర్' పేరుతో ఫాంటసీ, డ్రామా, కామెడీ, ఎంటర్‌టైనర్ మూవీగా తెరకెక్కిస్తున్నారు. ఈ మూవీ ద్వారా శ్రీరామ్ అనంత శంకర్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. విశ్వంత్ ప్రధాన పాత్రను పోషిస్తున్నారు. ఈ చిత్రం గురించి దర్శకుడు వివరిస్తూ, 'తాను చేసిన తప్పుల వల్ల జీవితం నిరాశాజనకంగా మారే ఒక ఆటో డ్రైవర్ ఈ ప్రపంచాన్ని మార్చాలని కలలుగంటాడు. అయినా, ఏమీ చేయలేకపోతాడు. అదేసమయంలో అతను తన 17 యేళ్ళ వయసులో తన రోల్ మోడల్‌ని చూస్తాడు. అపుడు జరిగే విచిత్రమైన సంఘటన ఒక విపత్తుగా ముగుస్తుంది. ఆ తర్వాత ఏం జరిగిందన్నదే ఈ చిత్ర కథాంశం' అని పేర్కొన్నారు. ఇతర పాత్రల్లో జాతీయ అవార్డు గ్రహీత నాగ విశాల్, కాత్తాడి రామమూర్తి, సునైనా, జగన్ తదితరులు నటిస్తున్నారు. రెజిమల్ సూర్య సినిమాటోగ్రఫీ సమకూర్చగా, కౌశిక్ క్రిష్ సంగీతం అందిస్తున్నారు. అక్షయ్ బొల్లా, ప్రశాంత్ ఎస్, శ్రీరామ్ అనంత శంకర్‌లు సాహిత్యం అందించారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ యేడాది ఆగస్టు నెలలో సినిమాను విడుదల చేసేందుకు దర్శక నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.

చిత్ర పరిశ్రమలో శ్రమిస్తేనే ఫలితం

దర్శకుడు పేరరసు



రిటైర్డ్ జడ్జి కృష్ణన్ నుంచి అవార్డు స్వీకరిస్తున్న పేరరసు

చిత్రపరిశ్రమలో కష్టపడితే విజయం తప్పకుండా వరిస్తుందని, ఈ విషయాన్ని ప్రతి ఒక్క వర్ధమాన కళాకారుడు గుర్తించాలని ప్రముఖ దర్శకుడు పేరరసు సూచించారు. వివిధ రంగాల్లో సమాజ సేవ చేసిన పలువురు సినీ కళాకారులకు మహా ఫైన్ ఆర్ట్స్, యునైటెడ్ ఆర్టిస్ట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. ఇందులో మాజీ న్యాయమూర్తి ఎస్‌కే కృష్ణన్ ముఖ్య అతిథిగాను, ప్రత్యేక అతిథిగా దర్శకుడు పేరరసు పాల్గొనగా మహాఫైన్ ఆర్ట్స్ అధ్యక్షురాలు డాక్టర్ అనురాధ జయరామన్, శిఖరం గ్రూపు ఎండీ ఆర్. చంద్రశేఖర్, తమిళనాడు ఆల్ స్పోర్ట్స్‌మెన్ వెల్ఫేర్ ఫెడరేషన్ జాయింట్ జనరల్ సెక్రటరీ ఎంఆర్ సౌందర్‌రాజన్ సీనియర్ సినీ పీఆర్వో నెల్లై సౌందర్‌రాజన్‌లు పాల్గొన్నారు. ఇందులో బెస్ట్ స్పెషల్ అవార్డును టీవీ నటుడు గునాలన్, బెస్ట్ డైరెక్టర్స్ స్పెషల్ అవార్డును మంగై హరిహరన్, బెస్ట్ అచీవ్‌మెంట్ అవార్డును నటి ప్రేమప్రియ, బెస్ట్ ఫిల్మ్ క్యారెక్టర్ ఆర్టిస్ట్ అవార్డును నటి అహల్య సరో, బెస్ట్ న్యూ ఫేస్ నటి స్పెషల్ అవార్డును నటి షర్మిణిలు అందుకున్నారు.

హీరో అవుతాడని కలలో కూడా ఊహించలేదు : విజయ్ సేతుపతి



దర్శకుడు అనలరసుకు గజమాలతో సన్మానం

తన కుమారుడు సూర్య సేతుపతి హీరో అవుతాడని తాను కలలో కూడా ఊహించలేదని నటుడు విజయ్ సేతుపతి అన్నారు. సూర్య సేతుపతి కథానాయకుడిగా పరిచయమవుతూ తెరకెక్కిన చిత్రం 'ఫీనిక్స్'. ప్రముఖ ఫైట్ మాస్టర్ అనలరసు దర్శకత్వం వహించారు. యాక్షన్ స్పోర్ట్స్ డ్రామాగా రూపొందిన ఈ చిత్రానికి శ్యామ్ సీఎస్ సంగీతం అందించారు. ఈ చిత్ర టీజర్ రిలీజ్ వేడుక ఆదివారం రాత్రి నగరంలో జరిగింది. ఇందులో పాల్గొన్న విజయ్ సేతుపతి మాట్లాడుతూ, 'నా కుమారుడు సినీరంగ ప్రవేశం ఒక ప్రణాళికాబద్ధంగా జరగలేదు. అస్సలు ఊహించినది. 'సంఘ తమిళన్' చిత్రంలో నటించిన తర్వాత ఫైట్ మాస్టర్ అనలరసు.. నా కుమారుడు సూర్యను కలిసి ఓ స్టోరీ వినిపించారు. ఇది నేను రవ్వంత కూడా ఊహించలేదు. అయితే, సినిమా ఇండస్ట్రీలో నిలదొక్కుకోవడం ఎంత కష్టమో వాడికి చెప్పాను. ఎందుకంటే చిత్రపరిశ్రమలో ఓర్పు అనేది ఎంతో ముఖ్యం. నేను ఎలాంటి ఒత్తిడిని ఎదుర్కొన్నానో అలాంటివి ఉంటాయని నాకు తెలుసు. ఇండస్ట్రీలో ఎదురయ్యే సమస్యలతో పాటు మంచి చెడులను కూడా వివరించాను. కానీ, అతనికి ఇదే నచ్చింది. అతనికి అనలరసు అనే గొప్ప వ్యక్తి పరిచయమయ్యాడు. నా కుమారుడు పుట్టినప్పటి నుంచి ఇప్పటివరకు 19 ఫాదర్స్ డేలను జరుపుకున్నారు. ఇది నాకు బెస్ట్ ఫాదర్స్‌డే' అని విజయ్ సేతుపతి వెల్లడించారు. కాగా, సూర్య సేతుపతి, వరలక్ష్మి, సంపత్, అభినక్షత్ర, ముత్తుకుమార్, దిలీపన్, అజయ్ ఘోష్, హరీష్ ఉత్తమన్, మనోహర్ రమేష్, విఘ్నేష్ తదితరులు నటించారు. అనలరసు సతీమణి రాజలక్ష్మి అనలరసు నిర్మించిన ఈ చిత్రానికి ఆర్. వేల్‌రాజ్ ఛాయాగ్రహణం అందించగా, శ్యామ్ సీఎస్ సంగీతం సమకూర్చారు.

పంచలింగ జలపాతం వద్ద పర్యాటకుల సందడి



జలపాతం వద్ద గుమికూడిన పర్యాటకులు

చెన్నై, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూరు జిల్లా ఉడుమలపేట తిరుమూర్తిమలై సమీపంలోని పంచలింగ జలపాతం వద్ద సోమవారం ఉదయం భారీ సంఖ్యలో తరలివచ్చిన పర్యాటకులు సందడి చేశారు. ఆ జలపాదం నుండి పడుతున్న నీటిధారల్లో స్నానం చేసేందుకు బారులు తీరారు. వారాంతపు సెలవులకు తోడు బక్రీద్ సెలవు కూడా రావటంతో సోమవారం ఉదయమే పర్యాటకకులు పంచలింగ జలపాతం వద్ద పెద్ద సంఖ్యలో గుమికూడారు.

తలపకట్టిలో 'ది గ్రేట్ ఇండియన్ బిర్యానీ ఫెస్టివల్'



బిర్యానీ ఫెస్టివల్' లోగోను ఆవిష్కరణ దృశ్యం

అడయార్, జూన్ 17: రాష్ట్రంలోని రుచికరమైన బిర్యానీ వంటకాలను అందించే రెస్టారెంట్లలో ఒకటైన దిండిగల్ తలపకట్టిలో 'ది గ్రేట్ ఇండియన్ బిర్యానీ ఫెస్టివల్' ప్రారంభమైంది. ఈ నెల 13వ తేదీ నుంచి జూన్ 8వ తేదీ వరకు జరిగే ఈ ఫెస్టివల్‌లో దాదాపు 23 రకాల బిర్యానీలను ఆహార ప్రియుల కోసం సిద్ధంగా ఉంచారు. ఇందులో మటన్ బిర్యానీ (విత్ బోన్), మటన్ బిర్యానీ బోన్‌లెస్, మటన్ కోలా బిర్యానీ, చికెన్ బిర్యానీ, చికెన్ 65 బిర్యానీ, ఎగ్ బిర్యానీ, వెజ్ బిర్యానీ, పన్నీర్ బిర్యానీ, వెజ్ కుష్కా, ప్రీమియం ఘీ బిర్యానీ, ప్రీమియం ఘీ రైస్ పన్నీర్ బిర్యానీ, ప్రీమియం ఘీ రైస్ చికెన్ బిర్యానీ బోన్‌లెస్, పల్లిపాళెయం చికెన్ బిర్యానీ, క్షత్రియ కబాబ్ బిర్యానీ, బీబీక్యూ చికెన్ బిర్యానీ, అల్ఫామ్ చికెన్ బిర్యానీ, పన్నీర్ టిక్కా బిర్యానీ, అమరావతి బిర్యానీ, గన్ ఫైర్ చికెన్ బిర్యానీ, చికెన్ టిక్కా బిర్యానీ వంటివి ఈ ఫెస్టివల్‌లో అందుబాటులో ఉంచాయి. ఈ ఫెస్టివల్‌లో బిర్యానీ వెరైటీలను ఆరగించే లేదా కొనుగోలు చేసే కస్టమర్లకు క్యాష్‌బ్యాక్ ఆఫర్‌ను కూడా ప్రకటించింది.